ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 24 ఫిబ్రవరి 2025



# ‘సోషల్’ ప్రచార జోరు..

- జోరందుకున్న ‘వాయిస్‌కాల్’ ప్రచారాలు
- టెక్నాలజీని వాడుకుంటున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు
- మద్దతు కోసం సొంత బృందాల ఏర్పాటు
- జిల్లాలో 23,347 మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఓట్ల వేటలో బిజీబిజీగా మారిపోయారు. మార్నింగ్ వాక్‌లు, ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈనెల 27న పోలింగ్ ఉండడంతో అభ్యర్థులు ఓటర్లందరిని కలవలేని పరిస్థితుల్లో సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని పెంచారు. టెక్నాలజీ ట్రెండ్‌ను వాడుకుంటూ తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 71 మంది బరిలో నిలవగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు 15 మంది, పట్టభద్రుల అభ్యర్థులు 56మంది ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నమయి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, కిసాన్ జనతా పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్, తెలంగాణ ప్రజాపార్టీ అభ్యర్థి డాక్టర్ వెంకటేశం, ఫార్వర్డ్‌బ్లాక్ అభ్యర్థి రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి జక్కు జడ్సన్,ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మంద జ్యోతి, తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ అభ్యర్థి బొల్లి సుభాస్, నవ క్రాంతి పార్టీ అభ్యర్థి చిలువేరి ఇంద్రా గౌడ్‌తో పాటు 44 మంది స్వతంత్రులతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, బీఎస్పీ అభ్యర్థి యాటకారి సాయన్న, దళిత బహుజన పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మిలతో పాటు స్వతంత్రులుగా వై అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, తిరుమల్ రెడ్డి, జన్నారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహస్వామి, మహేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, శ్రీకాంత్ సుహాసినిలు సోషల్ మీడియా ద్వారా ప్రచారాలు చేస్తున్నారు. ఉదయం లేవడంతోనే మొదలవుతున్న అభ్యర్థులు వాయిస్ కాల్స్ ప్రచారం పట్టభద్రులను ఇబ్బందులకు కూడా గురిచేస్తుంది. పేద, ధనిక తేడా లేకుండా అందరూ చేతుల్లోనూ స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడుతుండడంతో వాయిస్‌కాల్స్ వాట్సాప్‌లలో మెసేజ్‌లు పెడుతూ ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ మేరకు సోషల్ మీడియా ప్రచారం ఉపయోగపడుతుందో చూడాలి.

### పోటాపోటీగా ప్రచారాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 23,347 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 22,397మంది ఉండగా, పురుషులు 13,772 మంది, మహిళలు 8,625 మంది ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 950 మంది ఉండగా, పురుషులు 677 మంది, మహిళలు 273మంది ఉన్నారు. వీరిని ఆకట్టుకోవడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య పోటాపోటీగా ప్రచారం సాగుతోంది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకొని ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. ఈనెల 25వరకే ప్రచారానికి అవకాశం ఉండడంతో ప్రచార జోరును పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థి తరపున ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రచారాలు నిర్వహిస్తుండడంతో కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఓటర్లందరిని కలవలేని పరిస్థితుల్లో సోషల్ మీడియాను అభ్యర్థులు నమ్ముకోవడం గమనర్హం.

## న్యూస్ బాక్స్

### సర్వేకు గ్రామస్థులు సహకరించేనా?

- నేడు వెంకట్రావుపల్లెలో ఇంటింటా సర్వే

ఇల్లంతకుంట, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుటుంబ సర్వే లో వెంకట్రావుపల్లె గ్రామస్థులు పాల్గొనపోవడంతో సోమవారం మరోసారి సర్వే జరపాలని అధికారులు నిర్ణయించారు. గొల్లపల్లి గ్రామపంచాయతీ నుంచి ఐదేళ్ల క్రితం వెంకట్రావుపల్లె గ్రామపంచాయతీగా ఏర్పడింది. గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయభూములు, ఇళ్లు వెంకట్రావుపల్లె గ్రామంలో కలిపారని గ్రామపంచాయతీ ఎన్నికలను బహిష్కరించారు. కొంతకాలం తర్వాత ప్రభుత్వం మరోసారి ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చినా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోసారి ఎన్నికలు జరగలేదు. అన్ని గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు ఉండగా గొల్లపల్లికి మాత్రం ప్రత్యేక అధికారి కొనసాగారు. ప్రభుత్వం ఆరు నెలల క్రితం గెజిట్ ఇచ్చి రెండు గ్రామపంచాయతీల సరిహద్దులను నిర్ణయించింది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో వెంకట్రావుపల్లె గ్రామానికి అన్యాయం జరిగిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణను వెంకట్రావుపల్లె గ్రామస్థులు బహిష్కరించారు. అధికారులు గ్రామానికి వెళ్లి నచ్చజెప్పినా గ్రామస్థులు పట్టించుకోలేదు. దీనితో కేవలం ఐదుగురివి మాత్రమే అధికారులు నమోదు చేశారు. ప్రభుత్వం మరోసారి సమగ్ర సర్వేలో పాల్గొనడానికి అవకాశం ఇచ్చింది. దీనితో గ్రామంలోని 283 కుటుంబాలను ఒకేసారి సర్వేచేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. గ్రామస్థులు మాత్రం సమస్యలు పరిష్కరించాలని పట్టుబడుతున్నారు. గ్రామానికి మానకొండూర్ ఎమ్మెల్యే శనివారం రాగా గ్రామస్థులు సమస్యలను విన్నవించారు. రెండు గ్రామాలవారు శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

# గంజాయి.. ఎంజాయ్..



- మత్తులో జిల్లాలోని యువత..
- మాదక ద్రవ్యాల రవాణాపై పోలీసుల సీరియస్
- గడిచిన 50 రోజుల్లో 48 మంది అరెస్ట్
- గత సంవత్సరం 41 కిలోల గంజాయి పట్టివేత
- నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు





జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలోని యువత గంజాయి మత్తులో ఎంజాయ్ చేస్తున్నారు. గంజాయి అలవాటు నుంచి దూరం చేయడానికి ప్రచారం చేస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుంచి నిఘా కన్నుగప్పి వస్తూనే ఉంది. జిల్లా పోలీస్ యంత్రాంగం మత్తు నియంత్రణకు సీరియస్‌గా సమరం ప్రకటించింది. గంజాయికి అలవాటుపడిన యువతకు కౌన్సెలింగ్ ఇస్తూనే జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో వివిధ రూపాల్లో గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు, తినుబండారాల్లో సైతం గంజాయిని ఉంచి విక్రయిస్తున్న సంఘటనలు వెలుగు చూశాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంతో గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ తరహాలో గంజాయి పరీక్షల నిర్వహణకు పోలీస్ స్టేషన్‌లకు ప్రత్యేక కిట్‌లను కూడా అందించారు. గడిచిన 50 రోజుల్లోనే పటిష్ట నిఘాతో జిల్లాలో 22 కేసులలో 48మందిని ఆరెస్ట్ చేసి 2కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొక్కలను సైతం స్వాధీనం చేసుకున్నారు.

**● జిల్లాలో పెరుగుతున్న కేసులు...**

మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో యాంటీడ్రగ్స్ క్లబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మాదకద్రవ్యాలవల్ల కలిగే అనర్థాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీలు, 5కెరన్‌లు వంటివి కార్యక్రమాలు చేపడుతున్నా గంజాయి కేసులు మాత్రం పెరుగుతున్నాయి. 2021లో 22 కేసుల్లో 71మందిని ఆరెస్ట్ చేసి 56.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 2022లో 16కేసుల్లో 51 మంది ని ఆరెస్ట్ చేసి 35 కిలోల 09 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. 2023లో 61 కేసుల్లో 141 మందిని ఆరెస్ట్ చేసి 71 కిలోల 794 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గత సంవత్సరం 2024లో 93 కేసుల్లో 211 మందిని ఆరెస్ట్ చేసి 41కిలోల 272 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి 141 హిస్టరీ షీట్స్ ఓపెన్ చేశారు. ఈ సంవత్సరం ఇప్పటికి 22 కేసుల్లో 48 మందిని ఆరెస్ట్ చేసి 2కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

**● జాగిలాలతో తనిఖీలు..**

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి విస్తృత అవగాహన కార్యక్రమాలతో పాటు సిగరెట్లు, చాక్లెట్లు, ఇతర తినుబండారాలతో గంజాయిని ఉంచే అక్రమాలపై నిఘా పెంచి నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేస్తున్నారు. గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్‌ల ద్వారా గంజాయిని సేవించే వారిని గుర్తించి గంజాయిని అందిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

**● జిల్లాలో బ్రేక్ పడినా...**

**పొరుగు రాష్ట్రాల నుంచి రవాణా**

జిల్లాలోని అటవీ గ్రామాల్లో కంది, పత్తి, బంతి, పంటల్లో గంజాయిని అంతర్‌పంటగా గతంలో సాగు చేసేవారు. పోలీస్, ఎక్సైజ్ అధికారుల..

మిగతా 8లో

# భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా ఏర్పాట్లు

- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరకు విచ్చేసే భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో చేపడుతున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆదివారం రాత్రి పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో ఆలయ పరిసరాలు, గుడిచెరువు, శివార్చన స్టేజీ, ధర్మగుండం, క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు పోలీసులు ఏర్పాటుచేసిన సూచిక బోర్డులను అనుసరిస్తూ పార్కింగ్ స్థలాలకు వెళ్లి తమ వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట ఈవో వినోద్‌రెడ్డి పట్టణ సీఐ వీరప్రసాద్, నాగం కుమార్ తదితరులు ఉన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### నేటి ప్రజావాణి రద్దు : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న మహాశివరాత్రి, 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు క్షేత్రసాయిలో విధుల్లో ఉన్నందున సోమవారం జరిగే ప్రజావాణిని రద్దు చేశామని పేర్కొన్నారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

### నేడు కలెక్టరేట్‌లో పుస్తక పరిక్రమ ప్రారంభం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక పరిక్రమ మొబైల్ బుక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్లు దక్షిణ భారత కార్యాలయం బెంగుళూర్ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఈనెల 24వ తేదీనుంచి 27వ తేదీవరకు ఈ వాహనం తిరుగుతుందని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలకు సంచార పుస్తక ప్రదర్శన ప్రారంభం అవుతుందని అనంతరం రంగినేని ట్రస్ట్‌తోపాటు కేంద్రీయ విద్యాలయం, సిరిసిల్లలో ఆర్ట్ క్రాఫ్ట్ కార్యశాల, స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాపులు జరుగుతాయని మోహన్ తెలిపారు.

### సంత్ గాడ్గే బాబా జయంతి

వేములవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ భారత్ మూల పురుషుడు సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలను ఆదివారం వేములవాడలోని బీసీ సాధికారత సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్, రజక సంఘం అధ్యక్షుడు లింగంపల్లి దేవయ్య, మెరుగు జల, చింతలకోటి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా పాలనాధికారిని అడ్డం పెట్టుకొని అక్రమ అరెస్టులు, ఇబ్బందులు..

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య





మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాలనాధికారిని అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ నాయకులు అక్రమ అరెస్టులు, ప్రజలను రైతులను ఇబ్బంది పెడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆగయ్య మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కులగణనపై అసంబద్ధ వ్యాఖ్యలు చేశారని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడగట్ల మురళి, నాయకులు కుంభాల మల్లారెడ్డి, బండ నర్సయ్య, గుండ్లపెల్లి పూర్ణచందర్ పాల్గొన్నారు.

### నీటి కోసం మహిళల ఆందోళన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నీటిని అందించే బోరు మోటార్‌లు కాలిపోయి మూడు నెలలు అవుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రాజీవ్‌నగర్‌వాసులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు రాజీవ్‌నగర్‌లో ప్రజలకు నీటిని అందించే బోర్ మోటార్‌లు చెడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం కాలిపోయిన బోర్ మోటార్‌లకు మరమ్మతులు చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు తాజా మాజీ కౌన్సిలర్ ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆదివారం కాలిపోయిన బోర్ వద్ద మహిళలు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ స్పందించి బోర్‌మోటర్‌లకు మరమ్మతులు చేయించాలని కోరారు.

## టిప్పర్ ఢీకొని యువకుడు మృతి



మహేశ్ (ఫైల్)

మానకొండూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంజర్ల గ్రామంలో ఆదివారం మోటార్ సైకిలిస్టును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హుజురాబాద్ మండలంలోని సిర్సపల్లి గ్రామానికి చెందిన వెంగల్‌దాస్ మహేశ్(18) టీఎస్ 02 ఎఫ్‌హెచ్ 0613 నంబరు గల మోటార్ సైకిల్‌పై ఆదివారం తెల్లవారుజామున కరీంనగర్‌కు బయలు దేరాడు. మండలంలోని చెంజర్ల గ్రామశివారులో ఎంపీ39 హెచ్ 1165నంబరు గల టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేశ్‌కు తీవ్రగాయాలు కాగా 108లో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి వెంగల్‌దాస్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

## బాత్‌రూంలో జారిపడి కానిస్టేబుల్..



విష్ణు (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన అగ్రారం విష్ణు(30) అనే కానిస్టేబుల్ ఆదివారం బాత్‌రూంలో జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో పనిచేస్తున్న విష్ణు కొద్దిరోజుల క్రితం గుండెపోటుకు గురికాగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇంట్లో రెస్ట్ తీసుకుంటున్న సమయంలో బాత్‌రూంకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతిచెందాడు. విష్ణుకు తల్లిదండ్రులు రాములు, పుష్ప, భార్య నవ్య, కొడుకు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం తిప్పన్నపేటవద్ద ఈనెల14న జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన నాచుపల్లి గ్రామానికి చెందిన చిత్రపాల్(46) అనే వ్యక్తి వరంగల్‌లోని ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మృతుడి భార్య గంగాజమున ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు..

జగిత్యాలరూరల్/అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి శివారులో బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మల్యాల మండలం నూకపల్లి గ్రామానికి చెందిన రెడ్డిమల్ల స్నేహిత్(21) అనే యువకుడు ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. రెడ్డిమల్ల స్నేహిత్ తన పని నిమిత్తం శనివారం తాటిపల్లి నుంచి జగిత్యాల వైపు వస్తుండగా కారు ఎదురుగా వచ్చి స్నేహిత్ బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో తలకు, కాలుకు బలమైన గాయాలయ్యాయి. కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా స్నేహిత్‌ను మొదట జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యం అందించడంలో సిబ్బంది ఆలస్యం చేశారని అతడి స్నేహితుడు చంద్రశేఖర్ ఆరోపించాడు.

## పోలీస్‌స్టేషన్ సమీపంలో యువకుడిపై దాడి

కొడిమ్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన మహేష్‌పై కొందరు వ్యక్తులు ఆదివారం పోలీస్ స్టేషన్ సమీపంలో దాడిచేశారు. ఎస్సై ఎస్.సందీప్ తెలిపిన వివరాలమేరకు కొడిమ్యాలకు చెందిన హరీష్ ఓ యువతిని వారం క్రితం ప్రేమవివాహం చేసుకున్నాడు. ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఆదివారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరిస్థితిని వివరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌కు సమీపం నుంచి హరీష్ అన్న మహేష్ మిత్రులతో కారులో వెళ్తుండగా ప్రేమవివాహం ఇష్టం లేని వధువు బంధువులు అతడిపై దాడిచేశారు. గాయపడ్డ మహేష్‌ను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మహేష్ తండ్రి మల్లేశం ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రేమవివాహం చేసుకున్న జంటకు భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. గాయాలపాలైన మహేష్ క్షేమంగాఉన్నట్లుఎస్సై తెలిపారు.

## మద్యం మత్తులో ఏఎస్సైని ఢీకొన్న బైక్

- ముగ్గురికి తీవ్రగాయాలు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని గొల్లపల్లి రోడ్డులో శనివారంరాత్రి వాహనాలు తనిఖీచేస్తున్న రూరల్‌ఏఎస్సై శంకరయ్యను మద్యం మత్తులో బైక్‌తో ఇద్దరు యువకులు ఢీకొట్టారు. ఈసంఘటనలో ఏఎస్సై శంకరయ్యతో పాటుగా బైక్‌పై ప్రయాణిస్తున్న పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన నలువాల బక్కయ్య, నలువాల అంజయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా ఏఎస్సైని హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదానికి కారకులైన బక్కయ్య, అంజయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

# నేడు సీఎం పర్యటన

- కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో సభలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం పర్యటన సాగనున్నది. ఈ నియోజకవర్గ పరిధిలో ఒకే రోజు మూడు సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగించి తన ప్రభుత్వం ఏడాది కాలంగా చేపట్టిన పథకాలను, సాధించిన విజయాలను భవిష్యత్ కార్యాచరణను వివరించి పట్టభద్రుల మద్దతు కూడగట్టేందుకే ఈ పర్యటనను ఏర్పాటు చేసుకున్నారు.

- ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం 25న ముగియనున్నందున ఈ నియోజకవర్గంలో కీలకమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పర్యటనను ఆయన ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యాయ స్థానంలో అభ్యర్థిని నిలుపలేదు. పట్టభద్రుల స్థానంలో ప్రస్తుతం తమ పార్టీ ఎమ్మెల్సీ ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఆ స్థానాన్ని తిరిగి దక్కించుకోవడం ద్వారా కాంగ్రెస్‌పార్టీపై విద్యావంతులు సానుకూలంగా ఉన్నారనే సంకేతాలు రాష్ట్రంలో వీచేలాగా చూసేందుకే ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఈ ఎమ్మెల్సీ ఎన్నిక 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరుగుతున్నది. మూడో వంతు నియోజకవర్గాల్లోని పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్నందున ఏడాది కాంగ్రెస్ పాలనపై ఈ ఎన్నిక విజయం ఒక అభిప్రాయాన్ని ప్రజలకు చాటుతుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొని నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలను, మంత్రులను, ఇతర పదవుల్లో ఉన్న నేతలను రంగంలోకి దించి గడిచిన వారంరోజులుగా పట్టభద్రులను కలిసే కార్యక్రమాన్ని, వారి మద్దతు కూడగట్టే ప్రయత్నాన్ని చేస్తున్నది. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో బీజేపీ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇస్తున్న నేపథ్యంలో పోటీకి దూరంగా ఉన్న బీఆర్‌ఎస్ ఓటు ఎవరికి మళ్లుతుంది అన్నది ఇప్పుడు రాజకీయవర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.ఈ ఎన్నికల ఫలితాలు త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై కూడా ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికలు మూడు రోజుల్లో జరుగనుండగా ముఖ్యమంత్రి చేస్తున్న సుడిగాలి పర్యటన పట్టభద్రులను ఏమేరకు కాంగ్రెస్ వైపు మళ్లిస్తుందో చూడాల్సిందే.

- పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి ఉదయం 11 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి బయలు దేరి నిజామాబాద్ వెళ్తారు. 11.50 నుంచి 1.30 గంటల వరకు నిజామాబాద్‌లో జరిగే సమావేశంలో ప్రసంగించి అక్కడి నుంచి మంచిర్యాల వెళ్తారు. మంచిర్యాలలో 2.20 నుంచి 3.55 గంటల వరకు జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం ఆయన అక్కడి నుంచి కరీంనగర్‌కు వస్తారు. 4.25 నుంచి 5.50 గంటల వరకు కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగే పట్టభద్రుల సమావేశానికి ఆయన హాజరవు తారు. ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసిన పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధిని, భవిష్యత్‌లో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను ఆయన ఈ సమావేశంలో వివరిస్తారని సమాచారం.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని రైసుమిల్లుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంటకు చెందిన యాకయ్య ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతున్నాడు. రైసుమిల్లుల వద్ద కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌వైపు వెళుతున్న ఆర్టీసీబస్సు యాక య్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో యాకయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## పిచ్చికుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

వీణవంక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో పిచ్చికుక్కలు స్వైరవిహారంచేసి ఎనిమిది మందికి గాయాలు చేశాయి. గ్రామానికి చెందిన కొత్తపల్లి వీరమ్మ, సూర మ్మను తీవ్రంగా గాయపరచగా చికిత్సనిమిత్తం 108లో హుజు రాబాద్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మరో ఆరుగురికి స్వల్పగాయాలయినట్టు గ్రామస్థులు తెలిపారు.

# బలహీన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు



మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీదర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశ్యంతో కమిషన్‌ను ఏర్పాటు చేసి కుల గణన సర్వేను చేపట్టామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్పొరేట్ కళాశాలలు శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు దీటుగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు ఏర్పాటుచేసి నామ మాత్రపు ఫీజులతో విద్యార్థులను తీర్చిదిద్దుతుతున్నారన్నారు. అలాంటి విద్యావేత్తపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. వనరులు, ఉద్యోగాలు, రాజకీయ అవసరాలకనుగుణంగా బలహీనవర్గాలకు అన్నిరంగాల్లో రాణించే విధంగా రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టేందుకు కులగణన సర్వేను చేపట్టామన్నారు. రిజర్వేషన్లను యాభై శాతానికి పైగా పెంచాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేస్తుందా అనిప్రశ్నించారు. ఆర్థికవ్యవస్థ అంతంత మాత్రంగా ఉన్నా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థిక వ్యవస్థ అంతంత మాత్రంగా ఉన్నా ఒక డీఏను ఇచ్చామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పది సంవత్స రాలు నిద్రపోతే, తాము అధికారంలోకి వచ్చిన పది రోజులకే పదివేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు మెగాడీఎస్సీ ప్రకటించామన్నారు.. రాష్ట్రంలోని ఐఐటీలను ఏటీసీలుగా మార్చి టెక్నాలజీపరంగా శిక్షణకార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ముస్లింలు బీసీఈలుగా 2005 సంవత్సరంలోనే ఉన్నారన్నారు. ఇప్పుడు బీసీల్లో కొత్తగా ముస్లింలను తాము చేర్చలేదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒకటేనని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి సహకరించేందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థిని నిలపకుండా సహకారం అందిస్తోందని విమర్శించారు. కృష్ణ, గోదావరి జలాల వివాదంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. సుప్రీం కోర్టులో వాదనలు నడుస్తున్న తరుణంలో ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సుప్రీం కోర్టులో ఉండి తెలంగాణ శ్రేయస్సు కోసం కృషి చేశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జలాల వివాదంలో మిన్నకుండి కృష్ణ, గోదావరి జలాల విషయంలో రైతులకు అన్యాయం చేసిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, గిరిధర్‌రెడ్డి, ప్రణవ్, మహేందర్‌రెడ్డి, అరెపల్లి మోహన్ పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- కొలువుదీరిన మహాశివరాత్రి ఉత్సవ కమిటీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా రాజన్న ఆలయంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలు సమర్పించుకుని ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

- కొలువుదీరన మహాశివరాత్రి ఉత్సవ కమిటీ..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించే మహాశివరాత్రి జాతరకు నియమించిన ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా కమిటీ సభ్యులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. రాజన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 29 మందితో కూడిన సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈనెల 23వ తేది నుంచి 28వ తేది వరకు ఉత్సవ కమిటీ సభ్యులు పదవిలో కొనసాగుతారని, మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కొలువుదీరిన రాజన్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

## మల్క కొమురయ్యకు మద్దతుగా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళం



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య

హుజూరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆదివారం రాత్రి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు మద్దతుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్క రిస్తానన్నారు. ఉపాధ్యాయుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యా యులకు చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల సెల్‌ఫోన్లు.. మోత మోగుతున్నాయ్..

- 10నిమిషాలకు వాయిస్‌కాల్.. 15నిమిషాలకు ఒక మెసేజ్

చొప్పదండి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సెల్‌ఫోన్లు మోత మోగుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పోటీలోఉన్న అభ్యర్థులు పట్టభద్రుల ఓటరులిస్టును సేకరించి సెల్‌ఫోన్లకు వ్యక్తిగతంగా వాయిస్ రికార్డులను పంపిస్తున్నారు. పోటీలో ఉన్న దాదాపు అనేకమంది అభ్యర్థులు ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్లకు గంటగంటకూ వాయిస్‌మెసెజ్‌లు పంపుతూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాయిస్ కాల్‌తోపాటు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారు. ఓటరులిస్టులో క్రమసంఖ్యతోపాటు పోలింగ్ బూత్ చిరునామాతో కూడిన సమాచారాన్ని మెసెజ్‌రూపంలో పంపిస్తున్నారు. వాయిస్ కాల్స్ వచ్చే నంబర్లను ఓటర్లు జంక్, స్పామ్‌గా నమోదు చేస్తుండగా కొత్తనంబర్ల ద్వారా వాయిస్‌కాల్ చేస్తున్నారు. మూడు రోజులుగా అభ్యర్థుల వాయిస్‌కాల్స్‌తో పట్టభద్రుల సెల్‌ఫోన్లు మోత మోగుతున్నాయి. ప్రతిరోజు పదులసంఖ్యలో ఫోన్‌కాల్స్ వస్తుండడంతో ఓటర్లు విసుగెత్తుతున్నారు. చొప్పదండి మండలంలో 3300మంది పట్టభద్రుల ఓట్లు నమోదై ఉన్నాయి.

- ఫోన్ కాల్స్ ద్వారా సర్వే..

వాయిస్‌కాల్స్ ఎస్ఎంఎస్‌లతోనే ఓటర్లు విసుగుతు చెందుతుండగా అభ్యర్థుల కోసం కొన్నిసంస్థలు ఫోన్‌చేసి సర్వే చేపడుతుండడంతో ఓటర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరు ఎవరికి ఓటువేయాలనుకుంటున్నారు, ఫలానా అభ్యర్థికి ఓటువేస్తే ఒకటి నొక్కండి, మరో అభ్యర్థికైతే రెండు నొక్కండి, ఇంకో అభ్యర్థికైతే మూడు నొక్కండి అంటూ కొంతమంది అభ్యర్థుల పేర్లతో సర్వే చేస్తున్నారు. విరామం లేకుండా వస్తున్న ప్రచారవాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, సర్వేకాల్స్‌తో పట్టభద్రులు విసుగుచెందుతున్నారు.

# కరెన్సీ మ్యాన్‌కు.. కామన్ మ్యాన్‌కు పోటీ

- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎందుకు పోటీ చేస్తున్నారో చెప్పగలరా?
- ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పటుట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కరెన్సీమ్యాన్‌కు.. కామన్ మ్యాన్‌కు మధ్య జరుగుతున్న పోటీఅని ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని పూలే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సింహగర్జనసభలో ఆయన మాట్లాడారు. 2008లో తాను జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించిన నాటి నుంచి రాజీనామా చేసే వరకు తన జీతంలో 30శాతం పేదవిద్యార్థులు, యువతకు ఖర్చు చేస్తున్నానని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎందుకు పోటీచేస్తున్నారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేందుకు వచ్చినకార్పొరేట్‌వ్యక్తికి టికెట్ ఇస్తారా?అని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఇవ్వని వ్యక్తి, తన దగ్గర పనిచేసే ఉద్యోగుల సాదకబాధకాలను పంచుకోని వ్యక్తి, ఎలాంటి సామాజిక సేవచేయని వ్యక్తి పోటీచేస్తున్నాడన్నారు. బీసీ బిడ్డగా పోటీలో ఉన్నతనను ఓడించేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు రంగంలోకి దిగారని, ఆరుగురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు, ఇద్దరువిప్‌లు, 20మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలిసారిగా సీఎం ప్రచారానికి వస్తున్నారన్నారు. విద్యాసంస్థలు మానవకేంద్రాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా విద్యాశాఖకు మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. పట్టభద్రుల సమస్యలను గాలికి వదిలేసి తన ఆస్తిని కాపాడుకుంటూ విద్యారంగాన్ని వ్యాపారరంగంగా ఆదాయవనరులుగా మార్చుకుంటారన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పట్టభద్రులు ఈ వాస్తవాలను గ్రహించాలని కోరారు. టీపీసీసీ హోదాలో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు వరంగల్‌లో ఇచ్చిన హామీలను ఇంతవరకు సీఎం నెరవేర్చలేదన్నారు. బీసీ,ఎస్సీ, ఎస్టీలు రాజకీయాలు చేయకూడదా? అన్నారు. ప్రసన్న హరికృష్ణ గెలుపు అనేక ప్రశ్నలకు నాంది పలుకుతుందన్నారు. నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డికి నిరుద్యోగుల సమస్యలపైగానీ, 317జీవోపైగానీ, జీవో 46పై ఏమైనా తెలుసా అని ప్రశ్నించారు. 19సంవత్సరాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, పట్టభద్రులకు సరైన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికల బరిలో నిలిచి మీముందుకు వచ్చానన్నారు. అనంతరం ఆయన ఎన్నికల మెనిఫెస్టోపై సంతకం చేశారు. తనను గెలిపిస్తే జీతంలో 50శాతం నిరుద్యోగుల కోసం ఖర్చు చేస్తానని, జాబ్ క్యాలెండర్ అమలు, ఉద్యోగాల పెంపు, నాలుగు ఉమ్మడిజిల్లాలో డిగ్రీపూర్తి చేసిన వారి కోసం 3నెలలకొకసారి జాబ్‌మేళా, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ప్రైవేట్‌ఉద్యోగుల భద్రత, ఆరోగ్యభద్రత, గ్రంథాలయాల్లో ఉచితమధ్యాహ్నభోజనం, విద్యావ్యవస్థ బలోపేతం వంటి కార్యక్రమాలు చేపడతానని బాండ్ పేపర్‌పై సంతకం చేశారు. పట్టభద్రుల సమస్యలపై ఎవరికి స్పష్టత ఉందో గుర్తించి ఓటువేయాలని కోరారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్నహరికృష్ణ గెలుపు బీసీల రాజ్యాధికార సాధన ఆరంభం కావాలన్నారు. బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి ఒకే తాను ముక్కలని, పట్టభద్రుల ఓటుతో రెడ్డిల రాజకీయాలను సమాప్తం చేయాలని అన్నారు. ప్రసన్న హరికృష్ణ గెలిస్తే బీజేపీ బీసీ అభ్యర్థినే ముఖ్యమంత్రి చేస్తుందని, పొన్నం ప్రభాకర్ డిప్యూటీ సీఎం అయ్యే అవకాశం వస్తుందని, టీపీసీసీ అధ్యక్షుడు సీఎం అయ్యే అవకాశం కూడా వస్తుందని అన్నారు. ఒక్క ప్రసన్న హరికృష్ణ గెలుపుపై ఇంత మంది నాయకుల భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. రాష్ట్ర రాజకీయాలు మార్చుకోవాలంటే ఈ మార్పునకు కరీంనగర్ నుంచేనాంది పలకాలని రిటైర్డు ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణను గెలిపించి బీసీల సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు బండి సాయన్న, విఠల్, విక్రమ్, ఆది మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన పట్టభద్రులు



బాండ్ పేపర్‌పై సంతకం చేస్తున్న ప్రసన్న హరికృష్ణ



కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయం

## కోరిన కోర్కెలు తీర్చే కోటేశ్వరుడు

**● శాతవాహనుల తొలి రాజధాని**

వెల్గటూర్, (ఆంధ్రజ్యోతి): శాతవాహనుల తొలి రాజధానిగా ఖ్యాతికెక్కిన కోటిలింగాల క్షేత్రంలో పార్వతీకోటేశ్వరస్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. గోదావరి నదీ తీరాన శాతవాహనుల కోటలో కొలువైన కోటేశ్వరస్వామి ఆలయం ప్రత్యేకతను చాటుకుంటోంది. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో పర్యాటక శోభను సంతరించుకుంటోంది. ఇక్కడ గోదావరి నదిలో ఏర్పాటు చేసిన బోటింగ్ పర్యాటకులను ఆకర్షిస్తోంది. బోట్‌లలో విహరిస్తూ భక్తులు ఆనందంతో పరవశించి పోతున్నారు. గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కాశీ శివ లింగం, పార్వతీ కోటేశ్వరస్వామి, సిద్దేశ్వర స్వామి, అమ్మ వార్లను దర్శించుకుంటారు. శాతవాహనులు వారి కోటలో ఉన్న ఈశాన్య కోటలో ఆలయం నిర్మించి శివుడిని ప్రతిష్ఠించడం వల్ల కోటేశ్వరస్వామిగా పేరు వచ్చిందని ప్రతీతి.

**● శివరాత్రికి ఏర్పాట్లు**

కరీంనగర్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో, వెల్గటూర్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో కోటిలింగాల ఉంది. శివరాత్రి ఏర్పాట్లకు కోటిలింగాల పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయం ముస్తాబు అవుతోంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి ఆకర్షణీయంగా రంగులు వేస్తున్నారు.

**● ముస్తాబవుతున్న దుబ్బ రాజన్న**

సారంగాపూర్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంబట్ల, కోనాపూర్ దుబ్బరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ ఈవో వి. అనూష ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 24 నుంచి 28 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి లక్షల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.



దుబ్బరాజన్న స్వామి ఆలయం

**● పొలాసలో పొలస్తేశ్వర ఆలయం..**

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాసలో పొలస్తేశ్వర, సహస్రలింగాల శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఆలయాల్లో చలువపందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాలకు రంగులువేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తులు శివుడికి అభిషేకాలు నిర్వహించడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఈనెల 26 బుధవారం రోజున ఉదయం 4 గంటల నుంచి రాత్రి 9.30 వరకు రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో నిశిపూజ నిర్వహించనున్నారు.

**● మల్లాపూర్‌లో కనుక సోమేశ్వర ఆలయం..**

మల్లాపూర్: శివరాత్రి పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని శైవక్షేత్రాలు వేడుకలకు ముస్తాబు అవుతున్నాయి. మల్లాపూర్ మండల కేంద్రం శివారులోని కనుక సోమేశ్వర ఆలయంలో ఐదు రోజుల పాటు వేడుకలు జరగనున్నాయి. వాల్గొండలో త్రికుటాలయం, కొత్తధాంరాజుపల్లిలో ఉమామహేశ్వర ఆలయం, మొగిలిపేటలోని మహాదేవాలయం, వివిరావుపేటలో గంగాగౌరీశ్వరాలయంలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. కనుక సోమేశ్వరస్వామి దేవాలయం, సముద్ర మట్టానికి 1600 అడుగుల ఎత్తున కొండపైన వెలసింది. కాలినడకన భక్తులు గుట్టపై ఎక్కి గర్భగుడిలో గల స్వామిని దర్శించుకుంటారు.

## కరీంనగర్ కాశీ.. పాతబజార్ గౌరీశంకరాలయం

**● కాకతీయుల కాలంలో నిర్మాణం**

కరీంనగర్ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలంలో తొమ్మిది శతాబ్దాల క్రితం నిర్మించిన కరీంనగర్‌లోని పాతబజార్ గౌరీశంకరాలయం చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. కోరిన కోర్కెలు తీర్చే ఈ భోళా శంకరుడు సంతత రుద్రాభిషేక ప్రియుడై సకల శుభాలిస్తున్నాడని భక్తుల సంపూర్ణ విశ్వాసం.



పాతబజార్‌లోని శివాలయం

కాకతీయ రాజుల కాలంలో శైవాగమ ప్రకారం ఆలయాన్ని నిర్మించారు. నగరానికి ఈశాన్య భాగంలో భక్తవశంకరుడు కొలువై ఉండడం విశేషం. అప్పట్లో ఆలయానికి ఎటు చూసినా కిలోమీటర్ వరకు స్థలం ఉండేది. 15 గుంటల స్థలంలో నిర్మించిన ఈ ఆలయ ద్వార తోరణానికి గణపతి విగ్రహం కన్పిస్తుంది. భారీ ఆకృతిలో శివలింగం దర్శనమిస్తుంది. ఇది కాకతీయుల ప్రతిష్ఠకు, ఆగమ, శిల్ప కళా ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు. కాకతీయ రాజులు క్రమం తప్పకుండా స్వామిని దర్శించేవారట. స్వామికి ఎడమ వైపు గౌరీదేవి, కుడి వైపు కన్యకా పరమేశ్వరి కొలువై పూజలందుకుంటున్నారు.

**● ఉపాలయాలు..**


ఈ ఆలయంలో ప్రదక్షణ వలయంలో మూల స్వామికి ఎదురుగా నందితో వాయువ్యంలో నారాయణుడు కొలువైఉన్నాడు. ఎక్కడా లేని విధంగా నైరుతిలో బ్రహ్మ కొలువై పూజలందుకుంటున్నాడు. మరో వైపు చెన్న కేశవ స్వామి, సప్తమాతృకలు, సరస్వతి, గణపతి ద్వాదశ జ్యోతిర్లింగాలు, ఆంజనేయుడు, కాలభైరవుడు, బాల సుబ్రహ్మణ్యం మహిషా సురమర్ధని, సాయిబాబా దేవతామూర్తులు దర్శనమిస్తారు.



ఆలయంలో కొలువైన గౌరీశంకరస్వామి

**● ఆలయ విశిష్టత..**

ఈ ఆలయాన్ని దాదాపు 3 దశాబ్దాల క్రితం దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసికొంది. ఆలయంలో సూర్య విగ్రహానికి రథ సప్తమి రోజున పూజలు వైభవంగా జరుగుతాయి. సంవత్సరం పొడవునా సంకటహర చతుర్థి, మాస శివరాత్రి మొదలు బ్రహ్మోత్సవాల వరకు వైదిక కార్యక్రమాలు సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తారు. శివరాత్రికి ఈ ఆలయం అపర కైలాసంగా దర్శనమిస్తుంది.



# కోడెమొక్కుల రాజన్నకు కోటి దండాలు..

- ప్రతి ఏటా వైభవోపేతంగా మహాశివరాత్రి వేడుకలు
- రూ.2.03 కోట్లతో మహాజాతర ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా.. హరిహర క్షేత్రంగా.. కోడెకడితే కోటి వరాలు ఇచ్చే ఎములాడ రాజన్నగా.. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయం నిలుస్తోంది. ఈక్షేత్రంలో కొలువుదీరిన రాజన్న పేదల దేవుడిగా, ఎములాడ రాజన్నగా భక్తుల పూజలందుకుంటున్న రాజన్నకు ఘనమైన చరిత్ర వుంది. లెంబలవాటికగా పేరగాంచి క్రమేణా వేములవాడగా మారి ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోంది. దక్షిణకాశీగా పేరుగాంచి దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా వెలుగొందుతోంది.



**● రాజన్న ఆలయ ధర్మగుండం విశిష్టత..**

వేములవాడ క్షేత్రంలో ఉన్న కోనేరును ధర్మగుండంగా పిలుస్తారు. రాజరాజనరేంద్రుడు కుష్ఠు వ్యాధితో బాధపడుతూ ఈ క్షేత్రాన్ని సందర్శించి ధర్మగుండంలో స్నానం ఆచరించడంతో వ్యాధి నయం అయినట్లు స్థల పురాణం చెబుతోంది. అందుకే దీర్ఘకాలిక చర్మవ్యాధులతో బాధపడుతున్నవారు ధర్మగుండంలో స్నానాలు చేస్తే వ్యాధి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లించుకుంటారు.

**● కోడెమొక్కుల రాజన్నగా...**

రాజన్న ఆలయంలో విశిష్టమైన ఆచారం కొనసాగుతోంది. సంతానం లేని దంపతులు తమకు కొడుకు పుడితే కోడెను కడుతామని మొక్కుకుంటారు. సంతానం కలిగిన తరువాత కోడె దూడను రాజన్నకు సమర్పించుకుంటారు. అలాగే పాడిపంటలు, పిల్లాపాపలు బాగుండాలని ఇంటివద్ద పెంచి పోషించిన కోడెలను రాజన్నకు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. దీంతో కోడెమొక్కు చెల్లించుకుంటే కోటి వరాలు ఇచ్చే దేవుడిగా ప్రసిద్ధికెక్కాడు. ఇలా కోడెను కట్టలేని భక్తులు రాజన్న ఆలయానికి చెందిన అద్దె కోడెలను టికెట్ తీసుకుని మొక్కు చెల్లించుకునే వెసులుబాటు ఆలయం కల్పించింది.

**● రాజన్న ఆలయానికి చేరుకోవడం ఇలా..**

హైదరాబాద్ నుంచి 150 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 32 కిలోమీటర్ల దూరంలో వేములవాడ రాజన్న ఆలయం ఉంటుంది. వేములవాడ రాజన్న ఆలయానికి హైదరాబాద్ నుంచి రావాలంటే ప్రతి అరగంటకు ఒక బస్సు, కరీంనగర్ నుంచి ప్రతి 10నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఉంది. హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు సిద్దిపేట మీదుగా, వరంగల్, హన్మకొండ నుంచి వచ్చే భక్తులు కరీంనగర్ మీదుగా వేములవాడకు చేరుకోవచ్చు.

# ఓం నమఃశివాయ

**● మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు**

**శివరాత్రి వచ్చేసింది.** ఉమ్మడి జిల్లాలోని శైవ క్షేత్రాలు ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయంలో, ఇతర జిల్లాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా శైవ క్షేత్రాలు.. వాటి విశిష్టత గురించి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనాలు మీకోసం..

**● వైభవోపేతంగా మహాశివరాత్రి వేడుకలు..**

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలను వైభవోపేతంగా నిర్వహిస్తారు. ప్రతి యేటా నిర్వహించే మహాశివరాత్రి జాతరను ఈ సంవత్సరం సైతం అంగరంగ వైభవంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 25 తేది నుంచి 27వ తేది వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డిలు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మహాశివరాత్రి జాతరకు సుమారు నాలుగు నుంచి ఐదు లక్షల మంది వరకు భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు గాను రూ.2.03 కోట్లతో మహా జాతరకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

**రాజన్న ఆలయ చరిత్ర..**

రాజన్న ఆలయానికి సంబంధించిన అనేక పురాణ గాథలు ఉన్నాయి. పూర్వం నారదముని భూలోకంలో సంచరిస్తూ పాపాలతో బాధపడుతున్న జనాలను చూసి వారికి పాప విముక్తి కల్పించమని పరమ శివున్ని వేడుకుంటాడు. స్వామి మొదట కాశీలో, ఆ తరువాత చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరం మీదుగా వేములవాడలో ఉద్భవించినట్లు కథనాలు ఉన్నాయి. దక్షయజ్ఞంలో బాహువులు కోల్పోయిన సూర్యుడు ఇక్కడ ధర్మగుండంలో స్నానం ఆచరించి బాహువులు పొందాడని, అందుచేత దీనిని భాస్కర క్షేత్రంగా పిలుస్తారనే మరో కథనం ప్రాచుర్యంలో ఉంది. పూర్వం చెంబులవాటిక అని పిలిచేవారు. అది కాలక్రమంలో వేములవాడ అయిందని చెబుతారు. ఈ ప్రాంతాన్ని క్రీ.శ 750 నుంచి 973 వరకు చాళుక్యరాజులు పాలించగా, వారిలో మొదటి నరసింహుడికి రాజాదిత్య అనే బిరుదు ఉందని, ఆయన హయంలో కట్టిన గుడి కనుక ఇక్కడ శ్రీస్వామివారిని శ్రీరాజరాజేశ్వరుడని పిలుస్తారనే మరో కథనం ప్రాచుర్యంలో ఉంది.

**● శివరాత్రి రోజు జాగరణ..**

మహాశివరాత్రి రోజున వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా స్వామివారిని దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకుంటారు. చీకటి పడిన తరువాత ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించి జాగరణ దీక్ష చేస్తారు. రాత్రంతా నిద్రపోకుండా శ్రీస్వామి వారి ఆరాధన చేస్తూ తెల్లవారు జామున ఉపవాస దీక్ష వదిలి తిరుగు ప్రయాణమవుతారు.



## రాయికల్‌లో పంచముఖ లింగేశ్వరస్వామి

రాయికల్ (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని గుడికోట పంచముఖ లింగేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 26న శివరాత్రి రోజున స్వామివారి కల్యాణం నిర్వహించనున్నార. ఈ నెల 27న గురువారం స్వామి వారి అభిషేకములు, స్వామివారి నాగవెల్లి, బలిహరణ, స్వామివారి రథోత్సవం, అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కొత్తపేట నాగాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో అంకురార్పణం, శివరాత్రి అభిషేకాలు, స్వామివారి కల్యాణం, ఈ నెల 27న హోమం, 28న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

**పెగడపల్లి:** మహాశివరాత్రి జాతర



ముస్తాబవుతున్న పెగడపల్లి ఆలయం

బ్రహ్మోత్సవాలకు పెగడపల్లిలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 24 నుండి 27 వరకు జాతర ఉత్సవాలు జరుగనున్నాయి.

**గొల్లపల్లి:** మండలంలోని రాపల్లె, లోత్తునూర్ గ్రామాల్లోని శ్రీ రాజరాజేశ్వర దేవస్థానాలు, చిల్వాకోడూర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీరాముల పల్లె, వెన్గుమట్ల, రంగదాముని పల్లె గ్రామాల్లోని శ్రీ భక్తామార్కండేయ స్వామి ఆలయాలు, లక్ష్మీపూర్‌లో మునీశ్వరాలయంతో పాటు మండల కేంద్రంలోని శివాలయాల్లో మహా శివాత్రి జాతర ఉత్సవాలను ప్రతి ఏటా వైభవంగా నిర్వహిస్తారు.

## మంత్రపురి భిక్షేశ్వరస్వామి

మంథని, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు ఘనం జరుగనున్నాయి. మంథనిలోని పవిత్ర గోదావరి తీరంలో ఉన్న మంత్రపురి భిక్షేశ్వర స్వామి ఆలయం పడమర ముఖద్వారంతో ప్రత్యేకతను కలిగి ఉంది. దేశంలో కాశీలోని విశ్వేశ్వరాలయం, మంథని భిక్షేశ్వరస్వామి ఆలయాలు మాత్రమే ఇలాంటి ప్రత్యేకత కలిగి ఉన్నాయి. కాశీలోని మాదిరిగానే గర్భాలయంలో అన్నపూర్ణదేవి, దక్షిణమూర్తితో కలిసి భిక్షేశ్వరస్వామి లింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. మంథని పట్టణంలో శ్రీ సీలేశ్వర సిద్దేశ్వర ఆలయంలో భారీ లింగరూపంలో శంకరుడు దర్శనమిస్తున్నాడు.



మంథనిలోని శ్రీ భిక్షేశ్వరస్వామి ఆలయం.

**పెద్దపల్లి రూరల్ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ దత్తత అయిన రాగినేడు శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. శివరాత్రి సందర్భంగా ఈ నెల 25, 26 రెండు రోజుల పాటు మహాశివరాత్రి సందర్భంగా మహోత్సవాలు నిర్వహించనున్నారు.



సుల్తానాబాద్‌లోని కాకతీయుల నాటి గుడిమిట్ట రాజరాజేశ్వర స్వామి ఆలయం

**రామగిరి :** మండలంలోని కల్వచర్ల ఉమామహేశ్వర ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. అతి పురాతన ఆలయంలో కన్నుల పండువగా కల్యాణం నిర్వహించనున్నారు.

**సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని పాతబజారు శివాలయం, కాకతీయులు నిర్మించిన చారిత్రాత్మకమైన రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.



మంథనిలోని ఒకేచోట ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాలు

ఎల్లారెడ్డిపేట, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, అక్కపల్లి, రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలు మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈనెల 26న జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు జరుపుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



రుద్రంగిలో బుగ్గరాజరాజేశ్వరుని ఆలయం

**● అబ్బురం.. బుగ్గరామలింగేశ్వర ఆలయం..**

ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వెలసిన బుగ్గరామలింగేశ్వర ఆలయం ఎన్నో మహిమలు కలదని స్థానికులు పేర్కొంటున్నారు. 400 సంవత్సరాల కిందట ఆ ప్రాంతంలో మునులు తపస్సు చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఆ మహిమ వల్లే బండరాళ్ల మధ్య చెలిమె(బుగ్గ) నుంచి నీరు ఉబికి వస్తుండడం ఇక్కడి విశేషం. దాని వల్ల ఆ ఆలయం బుగ్గ రామలింగేశ్వర స్వామిగా పేరు గాంచిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. భక్తుల సంఖ్య పెరిగేకొద్దీ క్రమంగా నీటి శాతం పెరగడం మరో ప్రత్యేకత. బుగ్గ నీటితో స్నానాలు ఆచరిస్తే సర్వ రోగాలు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రతి యేటా శివ రాత్రి రోజున పవిత్ర స్నానాలు ఆచరించి భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.

**● మానాల సమీపంలో బుగ్గరాజరాజేశ్వర స్వామి**

రుద్రంగి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని మానాల గ్రామానికి వేళ్లే దారిలోగల అటవీప్రాంతంలో ఉన్న శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. యేటా శివరాత్రి రోజున కల్యాణం నిర్వహించి, మరుసటి రోజు జాతర నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం శివరాత్రికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల కోసం మహా అన్నదానం ఏర్పాటు చేస్తారు. గుట్టపైన ఉన్న శ్రీబుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయం పక్కనేగల రెండు రాళ్ల మధ్య నుంచి నీరు నిరంతరం వస్తుండడం విశేషం. ఎండాకాలంలోనూ జలబుగ్గలో నీరు పారుతుండటంతో స్వామి మహిమగా భక్తులు విశ్వసిస్తారు.

## విలాసాగర్‌లో త్రిలింగ సంగమేశ్వర స్వామి

బోయినపల్లి, (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినానికి బోయినపల్లి మండలం విలాసాగర్‌లోని శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. 11వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించిన ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయం మూడు ప్రధాన గోపురాలతో 24అడుగుల ఎత్తుతో, ముఖ మండపంతో ఉంటుంది. ఆలయంలో మూడు గర్భగుడులు ఉండగా మూడు శివలింగాలు సైతం భక్తులకు దర్శనమిస్తాయి. ముఖ మండపంలో ఆలయంలో ఎడమవైపు పార్వతి దేవి, కుడివైపు లక్ష్మీగణపతి కొలువై ఉన్నారు. ఆలయంలో అద్భుతమైన కట్టడాలు శిఖరాల పైన కలశం భక్తులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఆలయ ఆవరణలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం కూడా కొలువై ఉంది. అందుకే ఈ దేవాలయాన్ని శైవవైష్ణవ క్షేత్రం అని కూడా పిలుస్తారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతర శివకల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు.



శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి ఆలయం...

## పశువులు, జీవాలకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జంపల రాహుల్, పశువైద్యాధికారి, ఎల్లారెడ్డిపేట




**ఆంధ్రజ్యోతి:** పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**పశు వైద్యాధికారి:** మండలంలోని ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లోని పశు వైద్య కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల్లోని పశువులు, జీవాలకు వైద్య సేవలందిస్తున్నాం. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం. ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి వ్యాధులను గుర్తించి మందులను అందచేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి :** పశువుల్లో సోకే వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయా?

**పశు వైద్యాధికారి :** పశువుల్లో సోకే వ్యాధులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులతో వైద్యం అందిస్తున్నాం. పలు వ్యాధులకు సర్కారు మందులను అందించకపోవడం వల్ల కొరత నెలకొంది. అందుబాటులో లేని మందులను ప్రైవేటులో తీసుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

**ఆంధ్రజ్యోతి :** మండలంలో బర్డ్ ఫ్లూ లక్షణాలు ఏమైనా ఉన్నాయా?

**పశు వైద్యాధికారి :** మండలంలో ఉన్న 15 కోళ్ల ఫారంలను క్షేత్రస్థాయిలో సందర్శించాం. ఎక్కడ బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు. ఎండ వేడిమికి తాళలేక కోళ్లు చనిపోతున్నాయి.

- ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి)

# ఒక్క ఓటు మిస్ కావొద్దు.. స్థానిక నాయకత్వానిదే బాధ్యత..

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత తీసుకుని మండలంలో 800కు పైగా ఉన్న ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి కాంగ్రెస్‌కు ఓటువేసే విధంగా చూడాలని ఒక్క ఓటు మిస్ కావద్దని. ఆ పూర్తి బాధ్యత స్థానిక నాయకత్వందే అని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం గ్రామంలోని ఓ ప్రైవెట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ రాష్ట్రంలో గత 15నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలకు రిహర్సల్‌లాంటిదన్నారు. మీ గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను కాంగ్రెస్‌కు ఓటు వేసే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. బీజేపి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మొండి చెయ్యి చూపిందని, బీజేపి ఒకప్పటి రాష్ట్ర అధ్యక్షుడు ప్రస్తుతం కేంద్ర మంత్రి అని వేములవాడకు నిధులు తీసుకువస్తా అని ఏం చేశారని నిలదీశారు. తాము వేములవాడ ఆలయ అభివృద్ధికి, మిడ్ మానేరు నిర్వసితులు, సిరిసిల్ల చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కుల గణన చేసి చట్టసభల్లో 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వ కంకణం కట్టుకుంటే బీసీల్లో ముసింలు ఉన్నారని ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతున్నారు. గ్రామాల్లో ఉండే దూదెకుల వాళ్లకు మతపరమైన అంశాలు జోడించి రాజకీయం చేస్తున్నారని వివరించారు. ఢిల్లీలో మాట్లాడటం చేతకాదు కాని మతం పేరుతో రెచ్చగొతున్నారని అన్నారు.

### గాంధేయవాదానికి, గాడ్సేకు మధ్య జరుగుతున్న ఎన్నికలు..

- ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు గాంధేయవాదానికి గాడ్సేకు మధ్య జరుగుతున్న ఎన్నికలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ కార్యకర్తలకు సూచించారు. వేములవాడ మండలంలో నిర్వహించిన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి హజరైన ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటూ తెలుగు నేర్చుకుంటున్నాని అన్నారు. ప్రతి 50 మంది పట్టభద్రులకు ఒక్క ఇంచార్జీని నియమించాలని, నరేందర్‌రెడ్డి విద్యావంతుడని అన్నారు. 30 సంవత్సరాలుగా విద్యాలయాలను నడిపిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక విజనరీ సీఎం అని కితాబిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిని పెట్టకుండా బీజేపీ పార్టీకి మద్దతు ఇస్తున్నారని అన్నారు. కేసీఆర్, మోదీ, అమిత్‌షా ముగ్గురు ఒక్కటే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు రౌడీ రాజకీయాలు చేయడం రాదని, బీజేపీ వారు రౌడీ రాజకీయాలు, మతం పేరుతో రాకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

### పదేళ్లలో జరగని అభివృద్ధి సంవత్సరంలోనే..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సంవత్సరంలోనే చేసి చూపిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలో నిర్వహించిన పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది విద్యార్థులకు సేవ చేశాడని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ జరిగిందని, మళ్లీ పదేళ్లుగా డీఎస్సీ నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నిర్వహించన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ బలపరిచిన అభ్యర్థి నరేం దర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఒకే రోజు వెయ్యి కోట్లతో అభివృద్ది చేసిన విజనరీ సీఎం రేవంత్‌రెడ్డి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి మహేష్, వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు.

## గంజాయి.. ఎంజాయ్..

(5వ పేజీ తరువాయి)

నిరంతర దాడులతో పాటు గంజాయి విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపడంతో గంజాయి సాగుకు బ్రేక్ పడింది. గంజాయి సాగుకు తెరపడిందని భావించిన క్రమంలోనే పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి జిల్లాకు గంజాయి గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతోంది. ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామల నుంచి జిల్లాకు గంజాయి సరఫరా జరుగుతూనే ఉంది. జిల్లాలో గంజాయి నియంత్రణకు 8712656392 నంబర్‌కు కాల్ చేసి వివరాలు అందించాలని, సమాచారం గోప్యం గా ఉంచుతామని టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రచారం కూడా నిర్వహిస్తున్నారు. గంజాయి నియంత్రణపై పోలీస్ యంత్రాంగం నిఘా పెంచడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

### గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్..

- అఖిల్‌మహాజన్, ఎస్పీ



గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. గంజాయి అక్ర మ రవాణాపై గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిఘా ఉంచి కిట్ల సహాయంతో యూరిన్ టెస్టులు నిర్వహిస్తున్నాం. గంజాయి విక్రయించినా, సాగు చేసినా,రవాణా చేసేవారి సమాచారాన్ని అందజేయాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

### ఘనంగా పోచమ్మ బోనాలు


బోనాలతో మహిళలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహిళలు ఆదివారం పోచమ్మకు చలి బోనాలను ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థుల సమ్మేళం ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులు ఒక చోట చేరి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అంజల్‌రెడ్డి, జ్యోత్స్నలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాపురెడ్డి, దామోదర్, రాజు, రామచెందర్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణకుమార్, బాబు, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, లచ్చయ్య, తిరుపతి, స్వామి, రవీందర్‌రెడ్డి, షాదుల్లా, శ్రీనివాస్‌రెడ్డి, రజిత, కవిత, అరుంధతి, శారద, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### రైతు రాజిరెడ్డి అరెస్ట్ అన్యాయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : భూమిని ఆక్రమించాడనే నేపంతో సామాన్య రైతు రాజిరెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు పంపించడం అన్యాయమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లెల్ల గ్రామంలోని అబ్బాడి రాజిరెడ్డి ఇంటికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు బొల్లి రాంమోహన్, నేరేళ్ల సింగిల్ విండో అధ్యక్షుడు కోడూరి భాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబీంకార్ రాజన్న,మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యలు వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాట్లమధు, పూసపెల్లి సరస్వతి, సతీష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చక్రపాణి, బోడ్డు శ్రీధర్, అఫ్రోజ్,బొల్గం శ్రీనివాస్, సత్తిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

### టీజీటీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): టీజీటీటీఎఫ్ అధ్యక్ష, జిల్లా కార్యదర్శులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం టీజీటీటీఎఫ్ జిల్లా కమిటి సమావేశం జరిగింది. జిల్లాఅధ్యక్షుడిగా అజ్మీర మదన్‌లాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా బిక్కు నాయక్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా నునావత్ రాజు, సహా అధ్యక్షుడిగా బదనాపురం రవి, కోశాధికారిగా భూక్యారాజునాయక్, మహిళ అధ్యక్షురాలిగా భూక్య శైలాజ, ప్రధాన కార్యదర్శిగా కంది శిరీష, జిల్లా ఉపాధ్యక్షులుగా భూక్య తారాచంద్‌నాయక్, లాకావత్ బన్నాజీ, ఇస్లావత్ భూపతి, భూక్యా రమేష్, నునవత్ సునీత, జిల్లా కార్యదర్శులుగా భూక్య రాప్‌సింగ్, అజ్మీర రఘపతి, లాకవత్ మంజుల, ప్రచార కార్యదర్శిగా భూక్య సతీష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శర్మన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం


సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామోజీపేట శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చుట్టూగుట్టల మధ్య ఉండే ఆలయం సమీపంలోనే 56అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఉంది. వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అఖండ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, లక్ష తులసీ అర్చన, తమలపాకుల పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రుక్మాబట్ల సీతారామశర్మ, శశాంక్‌మౌళి శర్మ, రాంచరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### పుస్తెమట్టెల అందజేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనుగువాండ్లపల్లె గ్రామానికి చెందిన పాడిరైతు గొడుగు రాజమల్లయ్య కూతురు రవళి వివాహానికి కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ పక్షాన ఆదివారం పుస్తెమట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గుర్రం సతీష్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు బాలమల్లు, కార్యదర్శి నవీన్, రైతులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

గంభీరావుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్, స్కావెంజర్స్ జీతాల సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ స్వీపర్, స్కావెంజర్‌లకు జీతాలు రాక దాదాపు 7 నెలలు గడిచిపోయాయన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెబాట పడుతామని పేర్కొన్నారు. సునీత, దేవయ్య, లచ్చవ్వ, వనిత, వెంకటేష్, మల్లయ్య, రజిత, లత, నర్సవ్వ, రాజేశ్వరీ, కొమురవ్వ తదితరులు ఉన్నారు.

# ఘనంగా హన్మాజిపేట పాఠశాల వజ్రోత్సవాలు



పాఠశాల వజ్రోత్సవాల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హన్మాజిపేట ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో భావోద్వేగ దృశ్యాలు కనిపించాయి. పూర్వ విద్యార్థులంతా ఈ వేడుకకు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారంతా పాఠశాలకు విచ్చేశారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. గురువులను ఆహ్వానించి సన్మానించారు. తమతో చదువుకున్న స్నేహితులతో కలిసి పాఠశాల ఆవరణలో తిరుగుతూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాల పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. వేదికపై స్నేహితులతో కలిసి ఫోటోలు దిగారు. తమ చిన్ననాటి మధుర స్మృతులను, పాఠశాలతో తమకున్న అనుబం ధాన్ని వేదికపై మాట్లాడుతూ తోటి వారితో పంచుకున్నారు. 1949లో ప్రారంభమైన పాఠశాల వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా దాదాపు 500 మంది పూర్వ విద్యార్థులతో పాటు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా కలిసి కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు. అంతకుముందు పూర్వ విద్యార్థులకు పాటల పోటీలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ సంకశాల మల్లేశం తదితరులు డాక్టర్ సి నారాయణరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

### లేఖల ద్వారా సందేశం

మహోన్నత వ్యక్తి డాక్టర్ సీ నారాయణ రెడ్డి లాంటి ఎంతో మందికి విద్యనందించిన హన్మజిపేట పాఠశాల దేవాలయం లాంటిదని, పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవాలు జరుపు కోవడం ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తమ తమ లేఖల ద్వారా పూర్వ విద్యార్థులకు, పాఠశాల ఉపాధ్యాయులకు గ్రామస్థులకు శుభాకాం క్షలు తెలిపారు.

## శతాబ్ది ఉత్సవాలకు ఆర్ఎస్ఎస్ ముందడుగు

- ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ రాజుగోపాల్


సిరిసిల్లలో మాట్లాడుతున్న రాజుగోపాల్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్‌లో 1925 లో ఏర్పడిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దేశవ్యాప్తంగా విస్తరించి శతాబ్ది ఉత్సవాలను జరుపుకునేందుకు ముందడుగు వేస్తుందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కట్ట రాజుగోపాల్ అన్నారు. సిరిసిల్ల నగరంతోపాటు విలీన గ్రామాల్లో రోజు నిర్వహించే ఆర్ఎస్ఎస్ శాఖలన్నింటిని ఒకేచోట కలిసి మహాసాంఘీక్ కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజుగోపాల్ మాట్లాడుతూ సిరిసిల్లలో 19 ఆర్ఎస్ఎస్ శాఖల్లో 450 మంది స్వయం సేవక్‌లు పాల్గొనడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్, విభాగ్ కార్యవిహా పాకా సత్యనారాయణ, జిల్లా సంఘ్ చాలక్ నిరంజనాచారి, సిరిసిల్ల కార్యవాహా మడుపు శ్రీకాంత్‌రెడ్డి, సహా కార్యవాహ్ చిలుక వేణుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో ఇటీవల మృతిచెందిన పెంటారెడ్డి కుటుంబానికి మండల రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోని నాయకులు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, పద్మారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, చందర్, రాంరెడ్డి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగ శ్రీదుర్గాంబిక విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో ఆదివారం శ్రీ దుర్గాంబిక నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రభుత్వవిప్ వేములవాడ ఎమ్మెల్యే, ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు కచ్చకాయల బాల్‌రెడ్డి, సుంకరి రెడ్డి, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్, నీరటి సంజీవ్, సుంకరి పరుశరాములు, మాజీ సర్పంచ్ జిన్న అనిల్, ఉపసర్పంచ్ జిన్న అనిల్, రెడ్డి సంఘం నాయకులు ఆదిరెడ్డి, ఆనందొరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, బాపురెడ్డి, మల్లారెడ్డి, వేములవాడ ఆలయ చైర్మన్ కేతిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ వైస్ చైర్మన్ అల్లాడి రమేష్, రెడ్డి సంఘం నాయకులు నాయిని ప్రభాకర్ రెడ్డి, ఆనందరెడ్డి, మల్లారెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ జిన్నా అనిల్, మరియాల కిషన్, లచ్చిరెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రంగు మారిన మిషన్ భగీరథ నీళ్లు


రంగుమారిన నీళ్లు

చందుర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మల్యాల గ్రామంలో ఆదివారం గ్రామంలో సరఫరా అయిన మిషన్ భగీరథ నీళ్లు ఎరుపు రంగులో వచ్చాయి. వారం రోజుల నుంచి మంచినీళ్లు ఎరుపు రంగుతో రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రంగు మారిన మిషన్ భగీరథ నీళ్లను ఎలా వాడుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో పరిశుభ్రమైన నీటిని అందించాలని సంబంధిత అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా నేతల ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌వీ సుభాష్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీ ఎన్‌వీ సుభాష్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మండల ప్రభారీల సమావేశానికి రాజన్న జిల్లా ఇన్‌చార్జి సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపితో కలిసి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలని అన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రతి ప్రభారీ కృషి చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు శరత్‌రెడ్డి, తిరుపతి, పర్శరాములు, సత్యంరెడ్డి, సాయిలు, నరేశ్, సంజీవరెడ్డి, గణేశ్, శ్రీశైలం, బాలయ్య, కిరణ్, బాపురెడ్డి, రవి, ప్రకాశ్, యాదగిరి, కృష్ణహరి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంతో పాటు పదిర, హరిదాస్‌నగర్, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, కోరుట్లపేట, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసన మండలికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, రాజన్నపేట, తదితర గ్రామాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలకు మద్దతుగా పార్టీ నాయకులు ఆదివారం ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఇళ్ల వద్దకు చేరుకుని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వట్టెంల గ్రామంలో పార్టీ అభ్యర్థి తరఫున మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుడిసె శంకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, నాయకులు వినోద్, అబ్బాస్, ఆనంద్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### సరస్వతీ శిశు మందిర్‌కు రూ.లక్ష విరాళం

వేములవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు స్థానిక వైద్యుడు డాక్టర్ కె.మనోహర్ లక్ష రూపాయల విరాళం అందించారు. వేములవాడలో శ్రీవేంకటేశ్వర నర్సింగ్‌హోమ్ నిర్వాహకుడు అయిన డాక్టర్ కే.మనోహర్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సాయంగా లక్ష రూపాయల విరాళం అందజేసిన డాక్టర్ మనోహర్‌ను పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. పాఠశాల సమితి కార్యదర్శి గర్శకుర్తి వెంకటేశ్వర్లు, కోశాధికారి నమిలకొండ నరహరి, కమిటీ కార్యదర్శి మోటూరి మధు తదితరులు పాల్గొన్నారు.

### కేజీబీవీలో వీడ్కోలు వేడుకలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట కేజీబీవీలో ఆదివారం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి వసంత పాల్గొన్నారు.

### పురస్కార గ్రహీతకు సన్మానం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి చెందిన స్వర మాంత్రికుడు మహ్మద్ సలీం డాక్టరేట్ పురస్కారం అందుకోగా ఆదివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ అడగట్ల మురళి, నాయకులు కుంభాల మల్లారెడ్డి, బండ నర్సయ్య, గుండ్లపెల్లి పూర్ణచందర్ పాల్గొన్నారు.

### నియామకం

చందుర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కిషన్ మోర్చా మండల అధ్యక్షుడిగా చింతకుంట సాగర్, ఉపాధ్యక్షులుగా లింగాల రాజయ్య, కిషన్, ప్రధాన కార్యదర్శిగా తీపిరెడ్డి మనోహర్‌రెడ్డిలను నియమించి, నియామక పత్రాలను అందజేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు విజేందర్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, గంగాధర్, రాజయ్య, మల్లేశం, హనుమయ్య చారి, శ్రీనివాసరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### వేములవాడ వాసికి డాక్టరేట్

వేములవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణానికి చెందిన నక్క సులక్షణకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లో సంస్కృత అధ్యాపకురాలుగా పని చేస్తున్న నక్క సులక్షణ శ్రీవేంకటేశ చెంపు ప్రబంధాత్మక అధ్య అనే అంశంపై ఓయూ సంస్కృత విభాగం డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ కే.వరలక్ష్మి ఆధ్వర్యంలో సమర్పించిన పరిశోధనా గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు యూనివర్సిటీ ప్రతినిధులు వెల్లడించారు.

### అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వేములవాడ దేవాలయం ఆవరణలో ఉన్న దర్గా విషయమై అనుచిత వ్యాఖ్యలు చేసిన రవిందర్‌పై ఆదివారం కేసు నమోదుచేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ఒక వర్గం వారిని కించపరిచే విధంగా వీడియో వైరల్ అయినందున కేసు నమోదు చేశామని తెలిపారు.